న్యూస్‌రీల్

ఘనంగా సమ్మక్క, సారలమ్మ జాతర



జాతరను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జీఎం

చెన్నూర్/చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లోని జాతీయ రహదారి పక్కన, మండలంలోని కిష్టంపేట, సుబ్బరాంపల్లి గ్రామాల్లోని సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద జాతరకు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. డప్పుసప్పుళ్ల మధ్య శివసత్తుల పూనకాలతో గురువారం కంకవనంతో, సమ్మక్కను తీసుకొచ్చి పూజారులు గద్దెపై ప్రతిష్ఠించారు. మహిళలు బోనాలు పోసి తీపి నైవేద్యాలు అమ్మవార్లకు పెట్టారు.

శ్రీరాంపూర్: సీసీసీలోని ముక్కిడి పోచమ్మ వద్ద మినీ సమ్మక్క సారలమ్మ జాతర గురువారం ప్రారంభమైంది. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్ రావు, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అన్ని ఏర్పాట్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్లు పద్మ, సీనియర్ పీఓ కాంతారావు, ఆలయ పూజారి రమేశ్‌లు పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం'

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందని, బీసీల సంక్షేమానికి రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించారని బీసీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు నెన్నెల నర్సయ్య విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లో జిల్లా నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 75 కోట్ల మంది బీసీలు ఉన్నారని, దేశసంపద సృష్టిలో బీసీల పాత్ర అమితంగా ఉందని, జనాభా ప్రాతిపదికన రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీలపై అనుసరిస్తున్న వైఖరి మార్చుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో బీసీల ఆర్థికాభివృద్ధికి చేయూత కోసం రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్, నాయకులు ఇన్నారం కిరణ్, జంబోజి శ్రీనివాస్, అశోక్, శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ'

మంచిర్యాలఅర్బన్: డ్రైవర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల నివారణ సాధ్యమని ట్రాఫిక్ సీఐ నరేష్‌కుమార్ అన్నారు. గురువారం మంచిర్యాల డిపోలో ఈ నెల 2 నుంచి 7వరకు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మర్యాద, సురక్షిత డ్రైవింగ్‌పై హైర్ బస్సు డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో డీఎం రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్'ను సద్వినియోగం చేసుకోవాలి

శ్రీరాంపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు తెలిపారు. నస్పూర్ మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో గురువారం ఆయన అవగాహన కల్పించి 20మంది లబ్ధిదారులకు నమోదు చేసిన పత్రాలను అందించారు. ఇది ఎంతో చక్కని పథకం అని, కార్యకర్తలంతా దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ ఆనంద్‌కృష్ణా, పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్రం రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొంతం మహేందర్, నాయకులు అంబాల సాగర్, చింతకింద రవి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న గంగాధర్

చెన్నూర్: చెన్నూర్ మున్సిపల్ కమిషనర్‌గా గంగాధర్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే విధులు నిర్వర్తించారు.

'దాడిని ఖండిస్తున్నాం'

చెన్నూర్: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ చైర్మన్ భర్త మున్సిపల్ వ్యవహారంలో అతని తీరుపై వార్త రాశాడన్న నెపంతో రిపోర్టర్ మోత్కూరు గిరి యాదవ్‌పై దాడి చేయడం బాధాకరమని ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు భారత యాదవ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేష్ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ భర్త అనుచరులు రిపోర్టర్ ఇంటికెళ్లి దాడి చేయడం అమానుషమని, రిపోర్టర్‌ను కొట్టి అతని తల్లి, భార్యపై అనుచితంగా ప్రవర్తించడం హేయమైన చర్య అని అన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాంసం మంచిదేనా..?

- స్లాటర్ హౌజ్ నిర్మాణం లేదు
- వైద్య పరీక్షలూ లేవు..
- రోగాలబారిన పడ్డ మేకలను వధిస్తూ విచ్చలవిడిగా విక్రయాలు
- పట్టించుకోని అధికారులు



ఎన్టీఆర్ చౌరస్తా వద్ద మటన్ మార్కెట్లో మేకలు కోస్తున్న వ్యాపారులు

లక్సెట్టిపేట: మండలంలో మాంసం విక్రయాల వ్యాపారం మూడు పూవులు ఆరు కాయలుగా సాగుతుంది. రోడ్ల పక్కనే ఎటువంటి వైద్య పరీక్షలు నిర్వహించకుండానే రోగాలబారిన పడ్డ మేకలు కోస్తూ విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. బహిరంగంగా దుమ్ము, దూళి, ఈగలు, దోమలు వాలుతున్న మటన్‌ను అమ్మకానికి పెడుతున్నా, పట్టించునే అధికారులు కరువయ్యారు. మహారాష్ట్ర, పర్బన్, భైంసా నుంచి వందల కొద్ది మేకలు తీసుకొచ్చి, ఎటువంటి వైద్య పరీక్షలు నిర్వహించకుండా, నిబంధనలు పాటించకుండా అమ్మకాలు జరుపుతున్నారు.

నిబంధనలు గాలికి..

మాంసం విక్రయాలు చేయడానికి పట్టణంలో స్లాటర్‌హౌజ్ ఏర్పాటు చేయాలి. కోయడానికి సిద్ధం చేసిన మేకలను పశువైద్యాధికారితో పరీక్షలు చేపించి స్టాంప్ వేయించుకోవాలి. స్లాటర్ హౌస్ వద్దనే వాటిని కోసి అమ్మకాలు చేయాలి. వెటర్నరీ, మున్సిపల్ వారి ఆమోద ముద్ర ఉండాలి. వ్యాపారం చేయడానికి లైసెన్సు కలిగి ఉండాలి. కానీ నిత్యం ఇష్టారాజ్యంగా మేకలు కోస్తూ, అమ్ముడు పోక మిగిలిన మాంసాన్ని మరుసటి రోజున అమ్ముతూ వ్యాపారం చేయడంతో కొనుగోలు చేసిన ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని మాంసం విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్లాటర్ హౌస్ నిర్మించాలి



పట్టణంలో స్లాటర్‌హౌస్ లేకపోవడంతో మాంసం విక్రయదారులు ఇష్టారాజ్యంగా కోస్తూ విచ్చలవిడిగా మటన్ విక్రయిస్తున్నారు. రోడ్ల పక్కనే నిబంధనలు పాటించకుండా అమ్మకాలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకుని మటన్ విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి.

– రెడ్డిమల్ల ప్రకాశం, వినియోగదారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

స్థలం సేకరిస్తున్నాం



స్లాటర్‌హౌస్ లేకపోవడంతో మటన్ విక్రయదారులు దుకాణాల వద్దనే కోస్తున్నారు. స్లాటర్ హౌస్ నిర్మాణానికి స్థల సేకరణ చేస్తున్నాం. ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. పట్టణంలో సుమారు 25మటన్ దుకాణాలు ఉన్నాయి. అందరికీ ట్రేడ్ లైసెన్స్ ఇచ్చాం. అనుమతి లేనివారిపై చర్యలు తీసుకుంటాం.

– ఆకుల వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్, లక్సెట్టిపేట

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే చిన్నయ్య



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

కాసిపేట: ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం 50మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం గట్రావ్‌పల్లిలో రూ.7.60లక్షలతో సబ్‌సెంటర్ నిర్మాణ పనులను, సోనాపూర్ గ్రామపంచాయతీలోని బాదుగూడలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను, రొట్టపల్లి పంపౌజ్ వద్ద కుమురంభీం విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేసి ప్రారంభించారు. పల్లంగూడ ప్రభుత్వ పాఠశాలలో 'మనఊరు–మనబడి' కింద రూ.23లక్షలతో నూతనంగా చేపట్టిన భవన నిర్మాణాలను ప్రారంభించారు. గట్రావ్‌పల్లి, సోనాపూర్ గ్రామాల మధ్యలో ఉన్న వంతెన పగుల్లు తేలడంతో బ్రిడ్జిని పరిశీలించారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెడుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మి, వైస్ ఎంపీపీ విక్రమ్‌రావు, జెడ్పీటీసీ చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణరెడ్డి, ఎంపీడీవో ఎం.ఏ.ఆలీం, తహసీల్దార్ దిలీప్‌కుమార్, సహకార సంఘం చైర్మన్ నీల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బుచ్చయ్యపల్లిలో రూ.9లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించే సీసీ రోడ్లు, రూ.6లక్షల నిధులతో సీసీ డ్రైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే చిన్నయ్య ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ మాధవి, ఎంపీటీసీ సుభాష్ రావు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం'

బెల్లంపల్లిరూరల్: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే చిన్నయ్య అన్నారు. బుచ్చయ్యపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని, ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్, ఎంపీడీవో రాజేందర్, సర్పంచ్ మాధవి, ఎంపీటీసీ సుభాష్, పీహెచ్‌సీ వైద్యుడు అనీష్, వైద్య సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌పీవో



ఒత్కులపల్లిలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో



భీమారంలో కంటిపరీక్షలు చేస్తున్న వైద్యుడు

కోటపల్లి: కంటి సమస్యలతో బాధపడేవారు కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని డీఎల్‌పీవో ప్రభాకర్ రావు అన్నారు. మండలంలోని జనగామ గ్రామంలో నిర్వహించే కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఒత్కులపల్లిలో నిర్వహించే కంటి వెలుగు శిబిరంలో ప్రజలకు కల్పించిన వసతులను జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు పరిశీలించారు. రిజిష్టర్లు తనిఖీ చేశారు. ఆయన వెంట అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ వైద్యుడు ముస్తాఫా, హెచ్‌ఈవో జగదీశ్, కార్యదర్శి జాన్, ఏఎన్‌ఎంలు రాజమణి, హరిత, భాగ్యలక్ష్మి, ఆప్తాలజిస్ట్ నజీర్, డీవో సంపత్ ఉన్నారు.

భీమారం: స్థానిక ప్రభుత్వప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యులు కమలాకర్ కంటి వెలుగు పరీక్షలు నిర్వంచారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని ఎంపీడీవో శ్రీనివాస్ సందర్శించారు. ఇందులో కార్యదర్శి వేముల శ్రీనివాస్‌తోపాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



పత్తి రైతుతో మాట్లాడుతున్న సంకె రవి

కోటపల్లి: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి అన్నారు. రొయ్యలపల్లి, పుల్లగామ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను పట్టించుకోవడంలేదని, పత్తి ధర ప్రారంభ సమయంలో రూ.10వేలు పలికినా, ప్రస్తుతం రూ.7వేలకు పడిపోయిందన్నారు. విత్తనాలు, ఎరువుల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే పంటకు మాత్రం గిట్టుబాటు ధర రావడం లేదని ఆరోపించారు. ఈ ఏడాది వర్షాలు, ముంపు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, నాయకులు శ్రావణ్, శేఖర్, రాజబాపు, శ్రీకాంత్, రజినీకాంత్, రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గురుకులంలో రెండో స్థానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల 'స్వచ్ఛ గురుకుల 2022' కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో రెండో స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ లలితకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ గురుకులం కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఈ అవార్డు లభించిందని, రూ.50వేలు బహుమతి వచ్చినట్లు చెప్పారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు.

కరాటే శిక్షణతో విద్యార్థినులకు ఆత్మరక్షణ



శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

బెల్లంపల్లిరూరల్(బెల్లంపల్లి): బాలికల ఆత్మరక్షణకు కరాటే శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని బెల్లంపల్లి కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) ప్రత్యేకాధికారిణి సి.వాణి అన్నారు. కేజీబీవీలో విద్యార్థినులకు ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్ల్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌లో భాగంగా జిల్లా పరిధిలోని పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థినులకు నెల రోజుల పాటు ఉచిత కరాటే శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందన్నారు. ఆపద సమయంలో విద్యారినులు, మహిళలు తమను తాము రక్షించుకోవడానికి, శారీరక, మానసిక దృఢత్వానికి కరాటే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని సూచించారు. కరాటేలో నైపుణ్యం కలిగిన వారితో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థినీ చదువుతో పాటు కరాటే శిక్షణను సక్రమంగా అభ్యసించి ఆపదకాలంలో ఆత్మరక్షణ పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ డైరెక్టర్‌కు సన్మానం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్: గత నెల రిటైర్డ్ అయిన సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎస్ చంద్రశేఖర్‌ను గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ నేతలు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కొత్తగూడెంలో గురువారం జరిగిన కార్యక్రమంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావు ఆధ్వర్యంలో చంద్రశేఖర్‌కు సన్మానం చేశారు. దీనికి శ్రీరాంపూర్ డివిజన్ నుంచి నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, ఆ యూనియన్ ఉపాధ్యక్షులు డీ అన్నయ్య, మంద మల్లారెడ్డి, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి చాట్ల అశోక్, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి హాజరై వారిని ఘనంగా సన్మానించారు. ఆయన కంపెనీలో చేసిన సేవలను కొనియాడారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్(పీపీ) జీ వెంకటేశ్వర్‌రెడ్డి, మరో డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్‌లను కూడా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్తడి నేలలపై అవగాహన



లింగంపల్లి సమీపంలోని వనవిహార్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు



జన్నారం: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీవో

జన్నారం: ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం పురస్కరించుకుని జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని గొండుగూడ బేస్‌క్యాంపు సమీపంలో అటవీ అధికారులు విద్యార్థులకు చిత్తడి నేలలపై అవగాహన కల్పించి, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. చిత్తడి నేలలు, అడవుల రక్షణ తదితర అంశాలను ఎఫ్‌డీవో మాధవరావు తెలియజేశారు. జీవా వరణంలో చిత్తడి నేలల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి హఫీజొద్దీన్, ప్రభుత్వ బాలుర, బాలికల, కలమడుగు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు కొండు జనార్దన్, కట్ట రాజమౌళి, రాంరెడ్డి, నగేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామ సమీపంలోని వనవిహార్‌లో చిత్తడి నేలల దినోత్సవం పురస్కరించుకుని అటవీశాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు గురువారం ఎఫ్‌డీవో రమేశ్, ఎఫ్ఆర్‌వో శివకుమార్ చిత్తడి నేలలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, కిష్టంపేట సర్పంచ్ బుర్ర రాకేష్‌గౌడ్, లింగంపల్లి సర్పంచ్ అంగ లక్ష్మి, రమేశ్, ఎంపీటీసీ బొమ్మ పద్మ, కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ కుంభం ముకుందరెడ్డి, ఫారెస్ట్ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ విడుదల చేయాలని వినతి



ఎమ్మెల్యే దివాకర్‌రావుకు వినతిపత్రం ఇస్తూ..

మంచిర్యాలఅర్బన్: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. విద్యారంగానికి సంబంధించిన సమస్యలపై గురువారం స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల మధ్యాహ్నం భోజనం అమలు చేయాలని, ఫిబ్రవరి 5న ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యులు సంజయ్‌రామ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీపీవో ఫణీందర్‌రావు

భీమిని: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సభ్యుల అనుమతితో వీగాం ఎంపీటీసీ కర్ణ మమత అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పోశన్న చదువుతుండగా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందడం లేదని మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా అన్నారు. విద్యుత్ ఏఈ తమ నివేదికను చదివి వినిపిస్తుండగా గ్రామాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని, మల్లీడి, రాజారాం గ్రామాల్లో విద్యుత్ వైర్లు వేలాడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని, రైతులు వ్యవసాయం కనెక్షన్ల కోసం డీడీలు కట్టినప్పటికీ కనెక్షన్లు ఇవ్వడం లేదని బిట్టూర్‌పల్లి సర్పంచ్ ఎల్లాగౌడ్ ఆరోపించారు. అధికారులు హామీలు ఇవ్వడమే తప్పా ఆ హామీలు నెరవేర్చడం లేదని సర్పంచ్ కమల ఆరోపించారు. చిన్నతిమ్మాపూర్ గ్రామంలో రైతుల భూములు ధరణిలో లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు రైతులకు అందడం లేదని సర్పంచ్ భూమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని మల్లీడి సర్పంచ్ సంతోష్ కోరారు. ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి అధ్యక్షతన సమావేశం నిర్వహించాల్సి ఉండగా కొన్ని అనివార్యకారణాల వల్ల ఆమె హాజరుకాకపోవడంతో ఎలాంటి తీర్మాణాలు చేయలేదు. సమావేశంలో ఇన్‌చార్జి డీపీవో ఫణీందర్‌రావు, తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, ఎంపీవో సబ్దర్‌ఆలీ, సీడీపీవో ఉమాదేవి, హార్టికల్చర్ ఆఫీసర్ సుప్రజ, ఎక్సైజ్ ఎస్సై నిర్మల, ఏపీఎం ప్రకాష్‌గౌడ్, ఏపీవో భాస్కర్, ఏవో విజయ్, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని వినతి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరుతూ బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఏబీకేఎంఎస్ కార్యదర్శి పీ మాదవ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్‌లు గురువారం కంపెనీ డైరెక్టర్(పా, ఫైనాన్స్) బలరాం కోరారు. ఈ మేరకు కొత్తగూడెంలో ఆయన్ను కలిసి వినతి పత్రం అందించారు. చాలా ఏరియాల్లో కార్మిక కుటుంబాలకు కంపెనీ సరఫరా చేసే తాగునీరు కలుషితంగా వస్తుందన్నారు. ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన తాగునీటి సిస్టం నేడు అధ్వానంగా మారిందన్నారు. వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరిఖని వంటి ప్రాంతంలోని వివిధ పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు గోదావరి నదిలో కలువడంతో ఆ నీరు విషపూరితంగా మారుతుందని, దీనిని ఫిల్టర్ చేయకపోవడంతో కార్మికులు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఆ యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెండ్లి మోహన్‌రెడ్డి, కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డిలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

రూ.2లక్షల ఎల్‌వోసీ మంజూరు

కోటపల్లి: మండలంలోని సుపాక గ్రామానికి చెందిన గనుముకుల రాజన్న అనే వ్యక్తి కొద్ది రోజులుగా హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. రాజన్న ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక ఎంపీటీసీ తిరుపతి, వైస్ ఎంపీపీ వాలశ్రీనివాసరావు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బాల్కసుమన్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఎమ్మెల్యే బాల్కసుమన్‌కు రాజన్న కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి

కోటపల్లి: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎంపీపీ సురేఖా, సీఐ విద్యాసాగర్ అన్నారు. పిన్నారంలో గురువారం వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు.

పనులు పూర్తి చేయాలి

జైపూర్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాల్లో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు.